నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
5 | నల్లగొండ, గురువారం 19 జూన్ 2025 | YADADRI BHUVANAGIRI

యాదగిరీశుడి చెంత దుర్గంధం

యాదగిరిగుట్ట, జూన్ 18: యాదగిరిగుట్ట కొండ కింద ప్రాంతంలో పారిశుధ్యం పడకేసింది. భక్తుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ల వద్ద బురద గుంట ఏర్పడి భరించలేనంత దుర్గం ధం రావడంతో భక్తులు, యాత్రికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొండకింద కల్యాణకట్ట సమీపంలో తాగునీటి సౌకర్యం చెంతనే బురద గుంట నుంచి భరించలేనంత దుర్గంధం భక్తుల ముక్కుపుటాలు అదిరేలా చేస్తోంది. మంచినీళ్లు పట్టుకునే వాళ్లు ముక్కు మూసుకొని, నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా యాదగిరిగుట్టకు అభివృద్ధి చేసినప్పటికీ తలనీలాలు సమర్పించే కల్యాణకట్ట సమీపంలో పారి

కల్యాణకట్ట వద్ద ముక్కు మూసుకొని నీళ్లు పట్టుకుంటున్న భక్తులు

శుధ్యం ఆస్తవ్యస్తంగా ఉండటం తో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు.

నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఝూటా మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్

- అధికారంలోకి వచ్చి 16నెలలైనా హామీల అమలు లేదు
- 8నుంచి పదిశాతం కమీషన్ తీసుకొని కాంట్రాక్టర్లకు డబ్బులు
- హామీలు అమలుపై ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు..
- విలేకరుల సమావేశంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ, జూన్ 18: కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి 16నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో కాలం గడుపుతోందని నకిరేకల్ మాజీ శాసన సభ్యుడు చిరుమర్తి లింగయ్య విమర్శించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాధారణ కాంట్రాక్టర్లకు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలకు ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకుండా ఎనిమిది నుంచి పది శాతం కమీషన్ తీసుకొని బడా కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు ఇస్తున్నారన్నారు. వీటిపై నిలదీసిన బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పాలన ఎలా ఉందో ప్రజలకు అర్థమైందని..ఓటేసిన జనం మళ్లీ కేసీఆర్‌నే గెలిపించుకోవాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఎకరానికి పదిహేను వేలు ఇస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి, ఎన్నికల తర్వాత రైతులను దగా చేశారన్నారు. ఇప్పటివరకు రూ.1.79లక్షల కోట్లను అప్పుగా తెచ్చిన రేవంత్ సర్కార్ ఆ డబ్బులను కాంట్రక్టర్లకు ఇస్తూ కమీషన్ల పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలు పంచుకుతింటున్నారన్నారు. నల్లగొండ నుంచి ఇద్దరు మంత్రులు ఉండి ఒరగబెట్టిందేమి లేదని...కనీసం ఈ సీజన్‌లో రైతులకు రావాల్సిన రైతు భరోసా అయినా పూర్తిగా అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్రమే కీర్తిస్తే..ఆ ప్రాజెక్టు తప్పుడుదని ఆరోపిస్తూ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. అబద్ధపు మాటలతో సీఎం రేవంత్ బీఆర్ఎస్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నాడని..కానీ ప్రజ లు మాత్రం ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇప్పటివరకు కేటీఆర్‌పై 14, హరీశ్‌పై 7కేసులు పెట్టిన కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రేవంత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రైతు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్నికలు ముగిశాక రైతు భరోసాకు ప్రభుత్వం మంగళం పాడుతుందన్నారు. బీసీలకు 42శాతం ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ ఆమాట నిలబెట్టుకోవాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది అధికారులకు సంబందించిన విషయమని.. దీనికి కేటీఆర్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఇదంతా బీఆర్ఎస్‌ను బద్నాం చేసే కుట్రలో భాగమేనన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

నేతన్నకు రుణ విముక్తి ఎప్పుడో..?

అమలుకు నోచుకోని చేనేత రుణమాఫీ

గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన

- మూడు నెలల క్రితమే నిధులు మంజూరు
- ఇప్పటి దాకా చిల్లిగవ్వ మాఫీ చేయని సర్కారు
- కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన
- తాజాగా మార్గదర్శకాలతో ఇంకింత జాప్యం
- రాజీవ్ యువ వికాసానికీ నేతన్నలు దూరం..!

యాదాద్రి భువనగిరి, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేతన్నలకు రుణ మాఫీ ఒకడుగు ముం దుకు..రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారిం ది. ఇగో మాఫీ చేస్తం.. అగో చేస్తం.. అని ఊక దంపుడు ఉపన్యాసాలే తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదు. మాఫీ కోసం నిధులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నా చిల్లి గవ్వ కూడా మాఫీ చేయ లేదు. పైగా మార్గదర్శకాల పేరుతో ఇంకింత జాప్యం చేస్తున్నండటంతో నేతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికులు మగ్గాలు ఏర్పాటుకు, ఉత్పత్తికి ముడి సామగ్రి కొనుగోలు చేయడానికి రుణాలు తీసుకుంటారు. ఇందులో ఎక్కువ భాగం కోఆపరేటివ్ సొసైటీలు, బ్యాంకుల ద్వారా పొందుతారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6వేల మంది వరకు రుణాలు తీసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇందులో ఒక్క యాదాద్రి భువనగిరి జిల్లాలోనే సుమారు 3వేల మంది వరకు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు తీసుకున్న వారే అర్హులుగా గుర్తిస్తారు. ఎంత రుణం తీసుకున్నా రూ. లక్ష మాత్రమే మాఫీ అవుతుంది. రూ. లక్షకు మించి ఉంటే.. పై డబ్బులు చెల్లిస్తే

రూ. లక్ష రుణం మాఫీ అవుతుంది. బ్యాంకుల ఒత్తిడి మేరకు కొందరు బయట అప్పులు చేసి రుణాలు చెల్లించారు. ఇలా లోన్ క్లోజ్ చేసుకున్న వారికి కూడా స్కీం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు.

మార్చిలోనే నిధులు మంజూరైనా..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత రుణాలు మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అయితే గతేడాది సెప్టెంబర్ 9న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రారంభోత్సవం సందర్భంగా రుణమాఫీపై పలు చేనేత కార్మిక సంఘాలు సీఎం రేవంత్ రెడ్డి ద్రుష్టికి తీసుకెళ్లగా.. వెంటనే మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ తర్వాత కొంత కాలం పాటు స్తబ్ధుగా ఉన్నారు. ఆ తర్వాత జిల్లాల నుంచి రుణమాఫీ వివరాలన తెప్పించుకున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది మార్చి 9న నిధులు మంజూరు చేస్తూ చేనేత, జౌళి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిధులు మంజూరై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

మార్గదర్శకాల పేరుతో ఇంకింత జాప్యం..

చేనేత రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. దీన్ని అనుసరించి లబ్ధిదారుల జాబితాను తయారు చేయనున్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో జిల్లా కమిటీ ఉంటుంది. ఇక్కడ మార్గదర్శకాలకు అనుగుణంగా జాబితాను తయారు చేస్తారు. ఈ కమిటీ ఆమోదం తర్వాత చేనేత శాఖ డైరెక్టర్ అధ్యక్షతన ఉండే రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రతిపాదనలు పంపిస్తారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రుణమాఫీ చేస్తారు. అయితే ఈ ప్రక్రియ జరగడానికి సుమారుగా రెండు నెలల వరకు సమయం పట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. రైతు రుణమాఫీకి లేని మార్గదర్శకాలు నేతన్న రుణమాఫీకి ఎందుకని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కాగా గైడ్ లైన్స్ పేరుతో పెద్ద సంఖ్యలో అనర్హులుగా పరిగిణించాలని ప్రభుత్వం భావిస్తున్నదనే ప్రచారం జరుగుతున్నది.

రైతులకు లేని గైడ్‌లైన్స్ నేతన్నలకు ఎందుకు..?

చేనేత రుణానికి సంబంధించి డబ్బులు చెల్లించాలని, సిబిల్ స్కోర్ తగ్గుతుందని బ్యాంకోళ్లు ఫోన్లు చేసి ఒత్తిడి పెంచుతున్నారు. లక్ష రూపాయాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ నేటికి అమలుకు నోచుకోవడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలను చిన్నచూపు చూస్తున్నది. రైతు రుణమాఫీ మాదిరిగానే నేతన్నలకు కూడా వర్తింపజేయాలి. రైతులకు లేని మార్గదర్శకాలు.. నేత కార్మికులకు ఎందుకు..?

- కొంక లక్ష్మీనారాయణ, భూదాన్‌పోచంపల్లి

రాజీవ్ యువ వికాసానికి దూరం..!

రుణాలు మాఫీ కాకపోవడంతో నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతవి క్లియర్ కాకపోవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు అందక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక సర్కారు తీరుతో రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా రుణాలు పొందడానికి నేతన్నలు దూరం అయ్యే పరిస్థితి దాపురించింది. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా కచ్చితంగా దరఖాస్తుదారుడితోపాటు ఇంట్లోని కుటుంబ సభ్యుల రుణాలు, ఎన్‌పీఏను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇప్పుడు మాఫీ పూర్తి కాక పోవడంతో నేతన్నల కుటుంబ సభ్యులు పథకానికి అనర్హులుగా మారిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి త్వరగా రుణాలు ఇవ్వాలని నేతన్న కోరుతున్నారు.

పోలీసుల స్పాట్ సేవలు

- ఏఐ టెక్నాలజీతో దేవరకొండ పోలీసుల వినూత్న ప్రయోగం
- నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ మౌనిక నిర్వహణలో 'స్పాట్' యాప్ రూపకల్పన
- ఇటీవల సాగర్‌లో మిస్ వరల్డ్ ఈవెంట్‌లో వినియోగం
- వీఐపీ టూర్స్, మెగా ఈవెంట్స్‌లో యాప్ కీలకపాత్ర
- మెరుగైన సేవలకు ఎంతో ఉపయోగం



నల్లగొండ ప్రతినిధి, జూన్18 (నమస్తే తెలంగాణ): ప్రపంచమంతా ఏఐ టెక్నాలజీతో అన్ని రంగాల్లోనూ మెరుగైన సేవల వైపు అడుగులు వేస్తున్న విషయం తెలిసిందే. దీనిని స్ఫూర్తిగా తీసుకున్న దేవరకొండ పోలీసులు ఏఐ సహకారంతో పోలీసు శాఖలో పటిష్ట బందోబస్తు చర్యలు, పర్యవేక్షణకు శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రత్యేకంగా రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక నిర్వహణలో ప్రత్యేకంగా స్పాట్(SPOT)యాప్‌ను రూపొందించారు. యాప్ రూపకల్పన కోసం ఐఐటీ వారణాసి-బీహెచ్‌యూ ఐటీ నిపుణుల సహకారం తీసుకోవడం విశేషం. ఈ యాప్‌తో తొలిసారిగా ఇటీవల నాగార్జునసాగర్‌లో మిస్ వరల్డ్ సుందరీమణుల పర్యటన బందోబస్తును చేపట్టి సక్సెస్ అయ్యారు. స్మార్ట్ పోలీసింగ్ సేవలపైపు అడుగులు వేస్తూ దేవరకొండ పోలీసులు ఏఐ టెక్నాలజీతో పోలీసు సిబ్బంది డ్యూటీలతోపాటు బందోబస్తు చర్యలను పర్యవేక్షించేందుకు స్పాట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దేవరకొండ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మౌనిక తన పరిధిలోని సిబ్బంది పనితీరు మెరుగపడేలా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా, వీఐపీ టూర్స్, మెగా ఈవెంట్స్‌లో పకడ్బందీగా బందోబస్తు చేపట్టేలా దృష్టి సారించారు. ఈ క్రమంలో ఏఐ టెక్నాలజీ సహకారంతో మెరుగైన సేవల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. తనకున్న టెక్నాలజీ అనుభవంతో పాటు ఐటీ నిపుణులతో సంప్రదింపులు చేపట్టారు. ఇందులోభాగంగా ఐఐటీ వారణాసి-బీహెచ్‌యూకు చెందిన ఐటీ నిపుణులు మానిష్ వర్మ, శివసాయి సహకారం తీసుకున్నారు. మౌనికతోపాటు వీరిద్దరూ కలిసి ఏఐ ద్వారా బందోబస్తు చర్యల కోసం ప్రత్యేకంగా SPOT(SECURITY PERSONAL ON TRACK) అనే యాప్‌ను ఆవిష్కరించారు. దీని ద్వారా వీఐపీ టూర్స్, పెద్ద ఈవెంట్లలో పోలీస్ సిబ్బంది విధుల కేటాయింపు, పనితీరు, పర్యవేక్షణతోపాటు సమర్థవంతమైన సేవలను వినియోగించుకుంటున్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో దేవరకొండ ఏఎస్పీ మౌనిక రూపొందించిన స్పాట్ యాప్‌ను ఇటీవల తొలిసారి సాగర్‌లో జరిగిన మిస్ వరల్డ్ ఈవెంట్ సమయంలో ప్రయోగాత్మకంగా ఉపయోగించి మంచి ఫలితాలు సాధించారు.

స్పాట్ యాప్ ఫీచర్లు

- లైవ్‌లోకేషన్ ట్రాకింగ్: పోలీస్ సిబ్బంది ఎక్కడ ఉన్నారో యాప్ ద్వారా పర్యవేక్షణ చేయవచ్చు.
- జియో-ఫెన్సింగ్ అలర్ట్స్: నిర్దేశించిన 100 మీటర్ల పరిధి దాటి వెళ్లిన వెంటనే అలర్ట్ చేస్తుంది.
- దీర్ఘకాలిక గైర్హాజరు అలర్ట్స్: 10 నిమిషాలకుపైగా జోన్‌కు బయట ఉంటే అధికారి వద్దకు నోటిఫికేషన్ వెళ్తుంది.
- పెర్ఫార్మెన్స్ ర్యాంకింగ్: సిబ్బంది వారి క్రమశిక్షణ, హాజరు ఆధారంగా ర్యాంకింగ్ చేయవచ్చు.
- చిత్ర ధ్రువీకరణ(ఏఐ ఆధారంగా): యూజర్ తమ ఫోన్‌తో ఉన్నారో లేదో ఫొటో తీసి నిర్ధారణ చేయవచ్చు.
- డాష్ బోర్డ్ : సిబ్బంది ఎంత దూరమైనా, ఎంత సమయం బయట ఉన్నారో లెక్కలతో సహా చూపెడుతుంది.
- బ్రాడ్ కాస్ట్ అలర్ట్స్: యాప్ ద్వారా ఒకేసారి అందరికీ సందేశాలు పంపవచ్చు.
- లొకేషన్ మార్పు: అవసరాన్ని బట్టి సిబ్బందికి కేటాయించిన ప్రాంతాలను యాప్ ద్వారా మార్చవచ్చు.
- యూజర్ మేనేజ్ మెంట్: కొత్త యూజర్లను చేర్చడం, తొలగించడం చేయవచ్చు.

యాప్ పని చేసే తీరు...

స్పాట్ యాప్‌లో జియో-ఫెన్సింగ్ టెక్నాలజీని వినియోగించారు. దీని ద్వారా బందోబస్తు విధుల్లో భాగంగా ప్రతి పోలీస్ సిబ్బందికి 100 మీటర్ల పరిధిలో పని చేసే ప్రాంతాన్ని కేటాయిస్తారు. ఆ పరిధి దాటి ఆ సిబ్బంది బయటకు వెళ్లినా, వేరే పనుల్లో నిమగ్నమైనా యాప్ వెంటనే సంబంధిత పర్యవేక్షణ అధికారిని అలర్ట్ చేస్తోంది. ఇది రియల్‌టైమ్‌లో పర్యవేక్షణకు ఏంతో తోడ్పడుతుంది.

మెరుగైన సేవలకు ఎంతో తోడ్పాటు



కీలకమైన బందోబస్తు సమయాల్లో పోలీసుల విధి కత్తి మీద సాములా మారుతుంది. వీఐపీ టూర్స్, మెగా ఈవెంట్స్‌లో ఎక్కడా చిన్న పొరపాటు జరిగినా డిపార్ట్‌మెంట్ పరంగా చాలా ఇబ్బంది. ఆ సమయంలో పోలీసు సిబ్బంది పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షించడం సాధ్యం కాదు. అందుకే ఏఐ టెక్నాలజీపై దృష్టి సారించాం. ఐఐటీ వారణాసీ ఐటీ నిపుణులు సహకారంతో స్పాట్ యాప్‌ను ఆవిష్కరించాం. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో స్పాట్ యాప్‌తో సాగర్‌లో మిస్ వరల్డ్ పోటీదారుల బందోబస్తును పర్యవేక్షించాం. మంచి ఫలితాలు సాధించాం. పోలీసు సిబ్బంది పనితీరు మెరుగపడేందుకు, సేవల్లో జవాబుదారీతనం పెంపొందించేందుకు యాప్ ఎంతో తోడ్పడుతుంది.

- ఏఎస్పీ మౌనిక

నూతన పద్ధతిలో సాగర్ స్పిల్‌వే మరమ్మతులు

నాగార్జునసాగర్ డ్యాం స్పిల్ వేను పరిశీలిస్తున్న ఎంవైకే బృంద సభ్యులు

నందికొండ, జూన్ 18: సాగర్ డ్యాం స్పిల్ వేపై ఏర్పడిన గుంతలను ఆధునిక పద్ధతిలో మరమ్మతులు చేపట్టేందుకు ఎంవైకే కంపెనీకి చెందిన కుల్దీప్ తివారీ, శ్రీకాంత్‌రాజ్, ఆదిత్య విక్రమ్, సుజిత్ చంద్ర, ఎస్ఎస్పీఐ కంపెనీకి చెందిన ప్రశాంత్ బృందం సభ్యులు బుధవారం స్పిల్‌వేను పరిశీలించారు. డ్యాం దిగువన ఉన్న స్పిల్ వే బకెట్ పోర్స్ వెంట వారు నడుచుకుంటూ వెళ్లి స్పిల్ వేపై ఏర్పడిన గుంతలను ఎన్ఎస్పీ అధికారులతో కలసి పరిశీలించారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నప్పుడు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తారు. రేడియల్ క్రస్ట్ గేట్ల నుంచి స్పిల్ వే మీదుగా 300 ఎత్తులో దిగువన ఉన్న బకెట్ పోర్స్‌లోకి నీరు అధిక వత్తిడితో వస్తుంది. ఈ క్రమంలో నీటి వత్తిడికి స్పిల్ వేపై గుంతలు పడతాయి. ప్రతి ఏటా ఈ స్పిల్‌వే గుంతలను పూడ్చడానికే ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. గతేడాది రూ.20 కోట్లతో స్పిల్‌వే పనులను చేపట్టారు. గతేడాది క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అనంతర మళ్లీ స్పిల్ వేపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా ఎంవైకే, ఎస్ఎస్పీఐ కంపెనీ సభ్యులు స్పిల్ వేను పరిశీలించారు. కంపెనీల ప్రతిపాదనలను ప్రభుత్వం అంగీకరిస్తే ఈ ఏడాదిలో కొంత మేరకు స్పిల్ వే పనులు చేపడతారని, లేనిపక్షంలో వచ్చే ఏడాది స్పిల్ వే పనులు ఉంటాయిని కంపెనీ సభ్యులు తెలిపారు. జూలై చివరిలోగా నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చే అవకాశం ఉండడంతో ఈ ఏడాది స్పిల్ వే పనులు చేపట్టే అవకాశం లేదని రిటైర్డ్ ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ, సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్

స్థానిక ఎన్నికలకు సై!

ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ సిద్ధం

- కాంగ్రెస్‌కు చరమగీతం పాడేందుకు స్థానిక సంస్థల ఎన్నికలే వేదికలు
- ప్రభుత్వం ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం మానుకోవాలి
- రైతు భరోసా ఎన్నికల స్టంట్‌లో భాగమే...
- మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్, జూన్ 18: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని, కాంగ్రెస్‌కు చరమగీతం పాడేందుకు స్థానిక సంస్థల ఎన్నికలే వేదికలు కానున్నాయని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మొదటి నుంచి బీఆర్ఎస్ కోరుతందని ఎన్నికలు అవసరం కావడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఇటీవల జరిగిన కులగణనలో బీసీల జనాభాను తగ్గించి 56శాతంగా చూపించి బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం విషయానికి వస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ వివరణను తీసుకున్న ఘోష్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మినిట్స్ ఇవ్వాలని అడిగినా ఇవ్వకుండా దాట వేస్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మంత్రివర్గ ఆమోదంతో ప్రణాళికాబద్ధంగా ఇంజినీర్ల సూచనల మేరకే కట్టడం జరిగిందని, కేసీఆర్‌పై బీఆర్ఎస్ పార్టీపై కోపంతో కూలిన ఒక పిల్లర్‌ను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును పక్కకు పెట్టి రైతుల పంటలు ఎండ బెట్టిందన్నారు. ఈ కార్రేస్ నిర్వహణ మంత్రివర్గ ఆమోదంతో జరిగిందని, చెల్లింపులు కూడా సక్రమంగా జరిగాయని కేటీఆర్ స్పష్టత ఇచ్చారన్నారు. కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై 16 మాసాల్లో 15 కేసులు పెట్టి ప్రజలను, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని ధ్వజమెత్తారు.యాసంగి రైతు భరోసాను పూర్తిగా ఇవ్వకుండానే వానకాలం రైతు భరోసాను ఇస్తున్నారని, ఇది ఎన్నికల స్టంట్‌లో భాగమని పేర్కొన్నారు. బీసీలకు మంత్రి పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వలేదని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ భిక్ష కాదని బీసీల హక్కు అని రాజ్యాంగంలో బీసీల రిజర్వేషన్ పెంచుతూ చట్టం చేయాలన్నారు. కేసీఆర్‌పై మంత్రులపై చేస్తున్న ఆరోపణలు, పెట్టిన కేసులను వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడీ భిక్షం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మడిపల్లి విక్రమ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోతె, జూన్ 18: నాణ్యతతో కూడిన పోషకాహారం అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్, మెయిన్ డ్రగ్స్ స్టోర్ ఫార్మసీ, ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, ఏఎంసీ రిజిస్టర్‌లలో ఈడీడీ నమోదు వివరాలు పరిశీలించారు. నమోదు చేసిన తేదీ ప్రకారం గర్భిణులను ప్రభుత్వ దవాఖానలకు ప్రసవం కోసం తీసుకెళ్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం నాగలక్ష్మికి స్వయంగా కలెక్టర్ ఫోన్ చేసి ప్రసవాలు ఎక్కడ జరిగాయో అడిగి తెలుసుకున్నారు. ప్రసవం తర్వాత ఇమ్యునైజేషన్ టైం ప్రకారం జరగాలని కలెక్టర్ సూచించారు. ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించిన కలెక్టర్ దవాఖానలోని అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, ఓపీ వివరాలను డాక్టర్ బిందును అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్ పరిశీలించి మందులు కొరత లేకుండా చూడాలని సూచించారు. గురువారం సాయంత్రానికల్లా దవాఖాన పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించారు. పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచాలని సూచించారు. పాఠశాల పరిసరాలతో

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

పాటు తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా తయారు చేసిన ఆహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మోతే 1 అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. పాఠశాల టెర్రస్‌పై భాగాన్ని పరిశీలించి నీళ్లు నిలిచి ఉండటం గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల సంఖ్య తక్కువగా ఉండటంపై కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని మన గ్రోమోర్‌లో ఎరువులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ సీతారాం నాయక్, డీఈవో జ్యోతి, ఫార్మసిస్టు విజయ శ్రీ, వైద్యాధికారి ఇన్‌చార్జి నిర్మల, ఎంపీడీవో ఆంజనేయులు, లక్ష్మి, కామేశ్వరి, ఎల్లమ్మ, సుశీల పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

చందంపేట(దేవరకొండ), జూన్ 18: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకుంటామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏకేబీఆర్ ప్ర